
# ఓదార్పు



## కప్పగంతుల శ్రీకృష్ణబహదూర్

'పోస్ట్'


చాలా రోజుల తరువాత ఇంటి ముందు పోస్ట్‌మేన్ కేక వినిపించింది. ఆత్రంగా కిటికీలోంచి తొంగి చూశాను. కవరు ఒకటి గిరవాటేసి వెళ్లిపోయాడు పోస్ట్‌మేన్.

కోడలు ఎక్కడ ఉందో? పెరట్లో బట్టలు ఆరేస్తోంది కాబోలు.

"అమ్మా! కరుణా!" గట్టిగా అరిచి పిలిచాను.

"వస్తున్నా మామయ్యా గారూ!" అంది కరుణ.

రెండు నిమిషాలకి తడి చేతులు టవల్‌తో తుడుచు కుంటూ వచ్చింది.



## నలభీమ బెనగళ్

తన మొదటి చిత్రంతోనే జాతీయస్థాయి గుర్తింపు పొందిన దర్శకుడు శ్యామ్ బెనగళ్ దర్శకత్వంలోనే కాదు, వాసనతోనే నోరూరించేట్టుగా వంట చేయగల దిట్ట[ట]. ఇతర విషయాలపైకి వెళ్ళిపోయిన మనసును వెనక్కి తెచ్చుకునేందుకు కొంత సమయం పడుతుంది కదా. ఆ సమయాన్ని వృధా చేయకుండా వంట చేస్తానని. తద్వారా చిత్ర నిర్మాణానికి ఉత్సాహం వస్తుందనీ అంటున్నాడీ దర్శకుడు. ఈయనకు 20 రకాల వంటలు చేయడం వచ్చుట. అంతే కాదు మీరు కూడా ఇలా చేసి చూడండి అంటున్నాడీయన. ఇంకేం మీరూ ప్రయత్నిస్తారా? బెస్టాఫ్‌లక్.

**ఎమ్. విజయలక్ష్మి**

"ఓ నాలుగు బట్టలు మిగిలిపోతే ఆరేసి వచ్చేశాను. చెప్పండి మావయ్యా. ఏమైనా కావాలా? ఇంకోసారి కాఫీ ఇవ్వనా?" అంది వినయంగా.

"వద్దమ్మా! పోస్ట్ వచ్చింది - ఏమిటో చూస్తావని పిలిచాను" అన్నాను. కరుణ తలుపు తీసి బయటికి వెళ్ళి గచ్చు మీద పడి ఉన్న కవరు తీసింది.

"మీకే మావయ్యా! మీ ఫ్రెండ్ శ్రీధర్‌రావుగారు రాశారు" అంది. కవరు తీసుకొచ్చి నా చేతికిస్తూ బల్ల మీద ఉన్న నా కళ్ళజోడు కూడా తెచ్చి ఇచ్చింది. రెండడుగులు దూరంలో నిలబడి కుతూహలంగా చూస్తోంది.

వీల్ ఛైర్‌లో నా శరీరాన్ని ఒకసారి కుదుపుకుని కూర్చుని కవరు చింపాను.

రెండేళ్ల క్రితం నాకు యాక్సిడెంట్ అయింది. నా కారుని లారీ ఢీకొట్టింది. నా పక్కన ఉన్న నా భార్య సుశీల మరణించింది. నాకు కాళ్ళు పోయాయి. ఆనాటి నుంచి నేను వీల్ ఛైర్‌కి అంకితం అయిపోయాను. ఉద్యోగం - నుంచి తీసేశారు. నా బాగోగులు నా కొడుకు, కోడలు, మనవరాలు చూస్తున్నారు. నా అదృష్టం ఏమిటంటే ముగ్గురూ మంచివాళ్లు... నన్ను ప్రేమతో చూసుకుంటారు.

నా విషయంలో ఎక్కువ శ్రమపడేది నా కోడలే. మంచి గుణాలు కల్ల నెమ్మదస్తురాలు. భార్యా వియోగం, అంగ విహీనం రెండూ భరించలేక నేను కుంగిపోతున్న సమయంలో ఎంతో ఓదార్చి, నేను ఎన్ని పనులు చెప్పినా ఓపిగ్గా చేసిపెట్టి నాకు కష్టం లేకుండా చేసింది.

ఆమెను నేను కూతురులాగే భావిస్తాను. చిరునవ్వుతో ఆమె వైపు చూసి చింపిన కవరు ఆమె చేతికిచ్చి ఉత్తరం చదివాను.

"ఒరేయ్! శ్రీరామచంద్రమూర్తి -

బాగున్నావురా? నీ సంగతులు ఏవీ తెలియడంలేదురా నాకు. రెండేళ్లు గడిచిపోయాయిరా నువ్వు ఆఖరి ఉత్తరం రాసి. నే నసలే ఉత్తరాలు రాయను. అందుచేత నీకు ఏ ఉత్తరం రాయలేదు. నీ దగ్గర్నుంచి మాత్రం ఎప్పుడూ ఉత్తరాలు ఎదురు చూసేవాడిని. ఏదీ ఒక్కటీ రాలేదు. కానీ, ఒరేయ్, నేను నిన్ను తలుచుకోని రోజు లేదురా. కష్టాలొచ్చినప్పుడు ఆ శ్రీరామచంద్రుడిని తలుచుకున్నా తలుచుకోకపోయినా నిన్ను తలుచుకునేవాడిని. నువ్వు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నాకు మోరల్ సపోర్ట్ అనుకో. సుఖాల్లో నిన్ను తలుచుకోలేదనుకో. వెధవనే. నేను ఎలాంటి వెధవనో నీకు తెలుసు గనక చెప్పేస్తున్నాను. నువ్వు నవ్వేసుకుని క్షమించేస్తావని నాకు తెలుసు.

ఒరేయ్ ఇప్పుడు నాకో కష్టమొచ్చిందరా. ఘోరమైన కష్టం - నాకు ఓదార్పు నువ్వు తప్ప ఎవ్వరూ చెప్పలేరు. నీ దగ్గరికి వస్తే గాని నా బాధ తీరదురా. నా ఇంట్లో నా కొడుక్కి చెప్పేశాను. నీ దగ్గర కొన్నాళ్లు ఉంటానని. సరేనన్నాడు వాడు. నేను నీ దగ్గరికి ఈ నెల ఇరవైన వస్తున్నాను. స్టేషన్‌కిరా. నన్ను చూస్తే చాలు నా కష్టం ఏమిటో నీ కర్థమైపోతుంది. నేను ఏడవాలనుకున్నా. సిగ్గు విడిచి ఏడవ గలిగింది నీ దగ్గరే. వచ్చి ఏడుస్తాను. నన్ను ఓదార్చడానికి రెడీగా ఉండు.

ఇట్లు<br>
నీ ప్రాణంలో కొంత భాగం<br>
శ్రీధర్

ఉత్తరం చదివి నాకు అదోలా అయిపోయింది.

"ఏమిటి సంగతులు మావగారూ?" అంది కరుణ.

"ఏం లేదమ్మా, రేపు ఇరవై కదూ. పొద్దున్న ఏడు గంటలకి ఈ ఊరు వస్తున్నాడు. నన్ను స్టేషన్‌కి ,మ్మన్నాడు. చాలా కష్టంతో ఉన్నానంటున్నాడు. నా కాళ్ల సంగతి వాడికి తెలియదు. నేను వెళ్ళితే బాగుంటుంది" అన్నాను.

"దానికేం... మీ అబ్బాయి కారులో తీసుకు వెళ్తారు. నేనూ వస్తాను. వెళ్దాం" అంది కరుణ.

నేను తలాడించాను.

ఆమె లోపలికి వెళ్ళింది. కుర్చీలో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను. మనసు బాల్యంలోకి వెళ్ళింది.

★ ★ ★ ★

స్నేహాలు రకరకాలు.

బాల్యస్నేహాలు స్కూల్ జీవితంలో ముఖ్యంగా ప్రారంభమవుతాయి. చాలా వరకూ ఇవి పెద్దయ్యాక తెగిపోతాయి. ఆ తర్వాత ఆఫీసులో స్నేహాలు, ఇరుగు పొరుగుతో స్నేహాలు, మన స్థాయికి తగిన డబ్బున్న వాళ్ళతో స్నేహాలు ప్రారంభమవుతాయి. ఇవీ తెగిపోతూ ఉంటాయి.

ఇంగ్లీష్‌లో ఫెయిర్ వెదర్ ఫ్రెండ్స్ అంటారు. అలాంటి స్నేహితులు ఎవరంటే, మనం కొంత పచ్చగా, సుఖ సంపదలతో ఉంటే దగ్గర చేరే స్నేహితులు. వీళ్ళు మనం కష్టాల్లో ఉన్నామన్నా మన డబ్బు తరిగి పోయిందన్నా మాయమయ్యే రకాలు.

నిజమైన స్నేహితులు మనం కష్టంలో ఉన్నా మన దగ్గర సంపదలున్నా లేక మనం దరిద్రంలో ఉన్నా మనతో బాటు ఉండేవాళ్ళు.

స్కూల్లో చదువుల్లో మార్కులు తగ్గిపోతే మన స్నేహం వదిలేసి బాగా చదివే వాళ్ళని అంటుకునే స్నేహితులని, ఇదే సరుకుని కాలేజ్‌లోనూ చాలామంది చూసి ఉంటారు.

ఆ దౌర్భాగ్యపు స్వార్థపరులు జాతికి చెందిన వాళ్ళం కాదు నేనూ, శ్రీధరరావూ.

శ్రీధరరావ్ మనస్తత్వం విచిత్రంగా ఉండేది. ఇంగ్లీషు మాటలో ఉపయోగించాలంటే కాంప్లెక్స్ పెర్సనాలిటీ అనవచ్చును.

అతను పిరికివాడు కాదు గానీ చాలా సెన్సిటివ్.

తను తప్పులు చేస్తాడు గానీ, ఎవరైనా దాని గురించి మాట్లాడితే తెగ బాధపడిపోతాడు. అతను ఇతరులని హేళన చెయ్యవచ్చును గానీ, ఇతరులు తిరిగి గేలి చేస్తే కృంగిపోతాడు.

అతను దేనికీ ముందుకు రాడు కానీ, అతనికి ప్రాముఖ్యత ఇవ్వకపోతే కుమిలిపోతాడు.

ఇలాంటి వాళ్ళని అనుమానం ఒక గాజు బొమ్మలా, జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది చేతగాక చాలామంది వీడో న్యూసెన్స్ అని దూరంగా ఉండేవాళ్ళు.

నేనొక్కడినే వాడికి క్లోజ్ ఫ్రెండ్‌ని.

ఒక మనిషి మనకి ఎందుకు నచ్చుతాడు అంటే ఒకే కారణం ఉండవచ్చు. లేదా అనేక కారణాలు ఉండవచ్చును. నాకు శ్రీధర్‌రావ్ నచ్చడానికి కారణం అతని దానగుణం.

నేను శ్రీమంతుల బిడ్డని. వాడికంటే డబ్బున్న వాడిని. నేనే వాడికి మిఠాయిలు, మామిడి ముక్కలు, ఐస్‌క్రీమ్ కొనిచ్చే వాడిని చాలాసార్లు.

ఒకసారి వాడికి వాళ్ళ మావ బ్యాటరీ కారు కొనిచ్చాడు. అది జపాను బొమ్మ. దాన్ని వాడు స్కూల్‌కి తెచ్చాడు. మిగతా పిల్లలు ఎవ్వరం అలాంటి కారు చూడలేదు. అందరం వాడి చుట్టూ గుమిగూడాం. అందరూ చూసి ఇస్తాం అంటున్నారు. వాడు ఒక్కళ్ళని కూడా ముట్టుకోనియ్యలేదు. విసుగు వచ్చి వాళ్ళు వెళ్ళిపోయారు.

నేను దోస్తని కదా!

నాకు అప్పుడు చూడ్డానికి ఇచ్చాడు ఆ కారు బొమ్మని. నాకు ఆ బొమ్మ చాలా నచ్చింది. ఎంతోసేపు ఆడుకున్నాను.

"నాకూ ఇలాంటి కారు ఉంటే బాగుణ్ణు" అన్నాను సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు ఆ బొమ్మని తిరిగి ఇచ్చేస్తూ.

శ్రీధరరావ్ ఒక్క నిమిషం ఆగి నావైపు చూశాడు.

"రామూ, నాకీ కారు చాలా నచ్చిందిరా. నువ్వూ ఇష్టపడుతున్నావు. నీకే తప్పకుండా ఇస్తాను. కానీ, నువ్వు మిగతా వాళ్ళని ముట్టుకోనియ్యనంటే నీకిచ్చేస్తాను. వాళ్ళంటే నాకిష్టం లేదు. నీ కోసం అంటే ఏదైనా ఇచ్చేస్తాను" అన్నాడు.

నాకు సంతోషం కలిగింది. గర్వం అనిపించింది కూడా! పాత్ర ఎరిగి దానం చేసే ఇంత మంచి స్నేహితుడు ఉన్నాడే నాకు! అని.

సంతోషంగా ఆ బొమ్మని తీసుకున్నాను. మా స్నేహం ఇంకా దృఢంగా మారింది.

శ్రీధర్‌రావు మార్కులు తక్కువ వచ్చినా, టీచర్ తిట్టినా, వాడికి ఏ కష్టం వచ్చినా, నాతో చెప్పుకునేవాడు. నేను ఓదార్చే వాడిని.

కొన్ని సమయాల్లో వాడి కోసమని వాడితో బాటు నేనూ చెయ్యని తప్పు చేశానని పనిష్మెంట్ తీసుకునేవాడిని. వాడు బాధపడుతూనే నా తోడుకు సంతోషించేవాడు.

కొన్ని సమయాల్లో వాడికి వచ్చే కష్టమే నాకూ వచ్చేది. అప్పుడు వాడు చాలా ధైర్యంగా, సంతోషంగా ఉండేవాడు.

వాడికే కాక నాకూ అదే కష్టం వచ్చిందంటే వాడికి అదేం మానసిక ఓదార్పో నాకు అర్థం కాలేదు. కానీ, వీడి బుద్ధి ఇలాంటిది అని అర్థం చేసుకుని నెమ్మదిగా ఉండిపోయేవాడిని.

మేమిద్దరం కాలేజ్‌లో కూడా కలిసి చదువుకున్నాం. అక్కడా వాడిలో మార్పు లేదు. నేనొక్కడినే స్నేహితుడిని.

అక్కడ వాడికి జరిగిన సంతోషకరమైన సంఘటనలకి, కష్టాలకి కూడా పంచుకోడానికి నేనొక్కడినే పార్ట్‌నర్‌ని.

కాలేజ్ అయ్యాక మేము కొంత దూరమ

య్యాం.

నేను పై చదువులకి, వాడు ఉద్యోగానికి వెళ్ళాం. వాడికి వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

స్టేషన్‌కి వెళ్ళాను నేను. రైలు కదిలేటప్పుడు నా చెయ్యి ముద్దు పెట్టుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

నాకూ అర్థమైంది. నా కళ్ళలోనూ నీళ్ళు నిండాయి. నా గుండె బరువెక్కింది.

కారణం - నా మిత్రుడు ఒంటరివాడయ్యాడు!

ఎవ్వరితోనూ కలవలేని వీడు పరాయి ఊళ్ళో ఎలా బ్రతుకుతాడో!

"నువ్వు రాసినా, రాయకపోయినా నేను ఉత్తరాలు రాస్తానురా... ధైర్యంగా ఉండు" అన్నాడు జాలిగా.

చెయ్యూపుతూ దూరమైపోయాడు నా నేస్తం.

తరువాత నేను పది ఉత్తరాలు రాస్తే వాడో పెద్ద ఉత్తరం రాసేవాడు. ఉత్తరం నిండా మనుషులని తిడుతూ, తను ఎంత తలడిల్లిపోతున్నాడో తెలిపేవాడు.

నాకర్థమైంది. వీడికో తోడు కావాలి!

మా బంధువుల్లో స్నేహ శీలి అయిన అమ్మాయి రాధ... ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. నేను వాళ్ల నాన్నకి శ్రీధర్‌రావు సంబంధం చూడమని చెప్పాను.

నేను చెప్పిన అమ్మాయి అని వాడు వెంటనే ఒప్పుకున్నాడు. నేను పొంగిపోయాను.

రెండేళ్లకి వాళ్లకో కొడుకు పుట్టాడు.

మా స్నేహం కొనసాగుతోంది. ఎప్పుడైనా కలిసే వాళ్లం. వాడితో పదేళ్లు గడిచాక రాధ జబ్బు చేసి మరణించింది.

తిరిగి ఒంటరివాడయ్యాడు నా ఫ్రెండ్!

వాడిని ఓదార్చడానికి వెళ్ళి, వాడి దుఃఖాన్ని చూసి తట్టుకోలేకపోయాను. నెల రోజులు నా ఆఫీస్‌కి లాస్ ఆఫ్ పే మీద లీవ్ పెట్టి వాడితో ఉండి, వాడి కొడుకు కోసం వాడు దుఃఖాన్ని దిగమింగాలని నచ్చజెప్పి వాడిని ఒక దారికి తెచ్చి తిరిగి వచ్చాను.

కాలచక్రం తిరుగుతూనే ఉంది. మేముః పెద్దవాళ్లమయ్యాం. రెండేళ్ల క్రితం నా భార్య పోయి నా కాళ్లు పోయి దుఃఖంలో ఉన్న నేను శ్రీధర్‌రావుకి ఏ సంగతీ చెప్పలేదు. ఉత్తరమూ రాయలేదు. ఎప్పుడూ వాడిని నేను ఓదార్చడమే కానీ, వాడు నన్ను ఎప్పుడూ ఓదార్చలేదు. తెలిస్తే అనవసరంగా బాధపెట్టినట్లవుతుంది. మళ్లీ నేనే వాడిని వాడు నా కష్టం చూసి బాధపడుతూంటే ఓదార్చాలి.

ఇది సాధ్యం కాని పని. అందుకని వాడికేం తెలియనీయలేదు. నాలో నేను కుమిలిపోయాను.

★ ★ ★ ★

ఇప్పుడు శ్రీధర్‌రావ్ ఏదో కష్టంలో ఉండి వస్తున్నాడు. బహుశ, ఇదే జీవితంలో ఆఖరి కష్టదశ కాబోలు. ఎందుకంటే మేమిద్దరం కూడా వృద్ధులమయ్యాం.

ఇంక ఎక్కువ కాలం బ్రతకలేము. వాడి ఈ చివరి కష్ట దశలో కూడా ఓదార్చాలని ఉంది నాకు.

కానీ ఇంక సాధ్యమా నాకు?

కాళ్లు పోయాయి. ముసలివాడినీ అయ్యాను. వాడిని ఎక్కడికీ తీసుకు వెళ్లలేను. వాడి మనోవ్యధ తగ్గేలా డైవర్షన్ కలగడానికి నాలుగు చోట్లకి కదలలేను.

ఏం చెయ్యడం? ఇంతకీ వాడికేం కష్టం వచ్చిందో?

నా మీద నమ్మకంతో వాడి కష్టం తీరుస్తానని వచ్చేస్తున్నాడు.

వాడింకా చిన్న పిల్లాడే. ఎలా వీడు నిలదొక్కుకునేలా చెయ్యడం? ఆలోచనలతో సతమతమవుతున్నాను.

★ ★ ★ ★

మర్నాడు పొద్దున్న ఏడు గంటలకి స్టేషన్లో నేను, కరుణ, మా అబ్బాయి రైలు కోసం నిలబడ్డాం. ట్రయిన్ పది నిముషాలు లేటు.

శ్రీధరరావు ఉత్తరంలోని మాటలు నా మనసులో మెదలుతున్నాయి.

"నన్ను చూస్తే చాలు నా కష్టం ఏమిటో నీ కర్థమైపోతుంది."

పాపం రైలు దిగగానే అందరి ముందూ కన్నీళ్లు పెట్టుకుంటూ తన కష్టం చెప్పుకుంటాడు కాబోలు. పిచ్చి సన్నాసి!

లేదా నన్ను చూసి దుఃఖం పట్టలేక ఏడ్చేస్తాడా?

కాళ్లు లేని నేను ఎలాగైనా వాడిని ఓదార్చాలి!

రైలు వచ్చేసింది. జనం గుంపులు గుంపులుగా కదులుతున్నారు. ఓ అయిదు నిమిషాల్లో సందడి తగ్గింది.

శ్రీధరరావు కనపడలేదు.

రాలేదా?

అదిగో, అప్పుడు ఖాళీ అయిన పెట్టె లోంచి ఒక పోర్టర్ ఒక వీల్ ఛైర్ దించాడు. తరువాత శ్రీధరరావుని ఎత్తుకు వచ్చి వీల్ ఛైర్లో కూర్చోపెట్టాడు. ఒక సూట్‌కేస్ కూడా దించి దాన్ని ఒక చేత్తో పట్టుకుని ఇంకో చేత్తో వీల్ ఛైర్‌తోసుకుంటూ 'మా వైపు రాసాగాడు.

అవును. శ్రీధరరావుకి కాళ్లు లేవు!

వీల్ ఛైర్ మా దగ్గరికి వచ్చింది. వీల్ ఛైర్‌లో ఉన్న నన్ను చూశాడు. వాడు. నేనూ, శ్రీధరరావూ మొహా మొహాలు చూసుకున్నాం. అప్పుడే ఆ క్షణంలోనే నాకు శ్రీధరరావు కళ్లలో వాడు ఓదార్పు పొందిన భావం కనపడింది.

బాధతో వచ్చిన వాడికి సరిసమానమైన నా బాధతో తోడు చూపాను.

ఓదార్పుగలిగాను.

హమ్మయ్య, చాలు.

నేను చెప్పాల్సిందీ, చెయ్యాల్సిందీ ఇంక ఏమీ లేదు!

●



## అనాగరికంలోనూ అగ్రమే

ఎన్నో విషయాల్లో ముందుంటూ అగ్రరాజ్యంగా వెలుగుతున్న దేశం అమెరికా. చివరకు అది బాలలపై అనాగరికమైన, క్రూరమైన శిక్షలను అమలు జరపడంలో కూడా ముందే ఉందట. గత దశాబ్దంలో బాలనేరస్థుల పై క్రూర శిక్షలు అమలు జరిపిన ఏడు దేశాలలో అమెరికాదే పై చేయిగా ఉందట.

ఎం.వి

# భూతల స్వర్గం ఆ ద్వీపకల్పం

అత్యంత సుందరమూ, ప్రశాంత నిలయములూ అయిన ప్రదేశాలు కొన్ని భూతలంపై కనిపిస్తాయి. అనిర్వచనీయమైన, అవధులు లేని ఆనందాన్ని కలిగించే, ఈ ప్రదేశాలు కొన్ని ఈ భూగోళంపై ఇప్పటికే మిగిలి ఉండడం మన అదృష్టమనే చెప్పాలి. ఇట్టి ప్రదేశాలు భూతల స్వర్గాలుగా పేరొందాయి.

పర్యావరణానికి అంతులేని నష్టం కలుగుతున్న ఈ రోజుల్లో, అట్టి సుందర ప్రదేశాలను భావితరాలకై అలాగే కాపాడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

టువలు అత్యంత సుందరమైన దేశాల్లో ఒకటిగా పేరొందింది. ఇది మధ్య పసిఫిక్ ప్రాంతంలోని ఒక ద్వీపకల్ప దేశం. ప్రపంచంలోని అతి చిన్న దేశాల్లో ఒకటి. నిజంగా ఎంత చిన్నదంటే ఈ దేశ భూవైశాల్యం సుమారు 24.4 చ.కి.మీ. ఇక జనాభా అంటారు. తొమ్మిది వేల పై చిల్లర మాత్రమే. తొమ్మిది కోరల్ ద్వీపాల సమూహమైన ఈ దేశం 1.2 మిలియన్ల చ.కి.మీ. సముద్ర ప్రాంతంలో వెదజల్లబడినట్టు విస్తరించి ఉంది.

'టువలు' ఒక భూతలస్వర్గంగా పేరొందింది. అక్కడి ప్రభుత్వమూ, ప్రజలు తమ దేశాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంలో నిమగ్నమై ఉన్నారు.

1982 నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యకలాపాల్లో పాలు పంచుకొంటున్న 'టువలు', ఈ సంవత్సరమే ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఒక పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. దీనితో ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యదేశాల సంఖ్య 186 కు చేరింది.

- సమ్మెట

# రసికప్రియుల సరికొత్త విడిది

ఆకాశంనిండా దుమ్ము, ధూళి వ్యాపించి కలుషితమైనట్లే ఎయిడ్స్ భూతం ఆఫ్రికా, థాయిలాండ్, ఫిలిప్పీన్స్ దేశాలలో వ్యాపించి రసికప్రియులను బెంబేలెత్తించింది. అందుచేత కొత్త విడిది కోసం వేట మొదలైంది. ఇప్పటి దాకా పాశ్చాత్య దేశాలవారు దృష్టి సారించని దేశం వియత్నాం.

వియత్నాంలోని సముద్రతీర నగరం 'ఉంగ్‌తావ్'లో సముద్ర తీరమంతటా వెలసిన చిన్న చిన్న గదులలో అమ్మాయిలు విటులను ఆహ్వానిస్తుంటారు. కేవలం అమెరికా నుండి దిగుమతి చేసుకున్న కోకోకోలా ధరకు అక్కడ అమ్మాయిలు లభిస్తారు.

అక్కడకు పాశ్చాత్య దేశాల నుంచి కాకుండా పొరుగు దేశాలైన తైవాన్, హాంగ్‌కాంగ్, చైనాల నుంచి కూడా రసికప్రియులు వచ్చి తమ కోర్కెలు తీర్చుకుంటారు. అక్కడ విశాలమైన మైదానాలలో వ్యభిచారం విచ్చలవిడిగా జరుగుతుంది. అక్కడకూడా 'ఎయిడ్స్ ఫ్రీ' వ్యభిచార కేంద్రమని ప్రకటనలు కూడా దర్శనమిస్తాయి.

అత్యంత పేద దేశాల సరసన ఉన్న వియత్నాంలో కూడా త్వరలోనే ఎయిడ్స్ వ్యాపించే ప్రమాదం ఉన్నా ప్రస్తుతం వియత్నాంలో వ్యభిచారం ముగ్గురు వేశ్యలు - ఆరుగురు విటుల చందాన వర్ధిల్లుతోంది.

- ఎస్